

రైతులు సాగుచేసిన వరి

- అభివృద్ధికి కేరాఫ్‌గా నియోజకవర్గం
- 70 వేల ఎకరాలకు ఎంజీకేఎల్ఐ నీళ్లు
- గురుకులాల ఏర్పాటుతో విద్యాహబ్‌గా..
- కార్పొరేట్ స్థాయి వైద్య సేవలకు 'వంద'నం
- డయాలసిస్ కేంద్రంతో బాధితుల్లో ఆసరా
- ఆర్డీవో డివిజన్, డీఎస్పీ కేంద్రాలు ఏర్పాటు
- నంద్యాల హైవేతో మారనున్న రూపురేఖలు



కల్వకుర్తి మున్సిపాలిటీలో వీధివ్యాపారుల కోసం నిర్మించిన షాపులు

# కల్వకుర్తి.. ప్రగతి సిరి

కల్వకుర్తి, నవంబర్ 18: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కల్వకుర్తి నియోజకవర్గంలో నవశకం ఆరంభమైంది. అభివృద్ధిలో నియోజకవర్గ రూపురేఖలు మారిపోతున్నాయి. విద్య, వైద్యం, సాగునీరు పరంగా నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. కృష్ణాజలాలు కల్వకుర్తి నియోజకవర్గానికి వచ్చిన క్రమంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో ప్రగతి నిత్యకృత్యంగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పెరగడంతో ఉపాధి అవకాశాలు చాలా వరకు మెరుగయ్యాయి. ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగింది. దీనికితోడు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుంది.

**నెరవేరిన చిరకాలవాంఛ**

కల్వకుర్తి వాసుల చిరకాల వాంఛ మహాత్మగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. కల్వకుర్తి నియోజకవర్గానికి సాగునీరు అందించే ఉద్దేశంలో దాదాపు నాలుగు దశాబ్ధాల క్రితం శిలాఫలకం వేసిన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే వరకు కాగితాల మీద రాతలుగానే మిగిలాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్వకుర్తి ఎతిక్తపోతల పనుల్లో వేగం పెరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సాగుజలాలకు పెద్దపీట వేసిన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తయ్యాయి. 2017 నవంబర్‌లో కృష్ణాజలాలు కల్వకుర్తి పోతల కాల్వల ద్వారా పరవళ్లు తొక్కుతూ.. కల్వకుర్తి బీడు భూములను ముద్దాడాయి. గుడిపల్లి గట్టు నుంచి ప్రారంభమైన కేఎల్ఐ 29వ ప్యాకేజీ కాల్వ కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వద్ద 160 కిలో మీటర్ల వద్ద ముగిసింది. కల్వకుర్తి మండలం ఎలికట్ట సమీపంలో కేఎల్ఐ కాల్వ ప్రారంభమై జంగారెడ్డిపల్లి వద్ద ముగుస్తుంది. ఈ కాల్వ ద్వారా కల్వకుర్తి మండలంలో దాదాపుగా 37 వేల ఎకరాలకు సాగునీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందుతుంది.

**29వ ప్యాకేజీకి కొనసాగింపుగా..**

కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు సాగునీరు ఇవ్వాలని స్థానిక ప్రజాప్రతినిధుల వత్తిడి మేరకు సీఎం కేసీఆర్ డీ-82 కాల్వకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. దాదాపు రూ.180కోట్లతో 58 కిలో మీటర్ల కాల్వకు నిధులు మంజూరు కావడంతో పనులు పూర్తి కావచ్చాయి. 29వ ప్యాకేజీ డీ-82 కాల్వతో కల్వకుర్తి నియోజకవర్గంలో దాదాపు ప్రత్యక్షంగా, పరోక్షంగా 70వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. కాల్వ నీటితో నియోజకవర్గంలోని చెరువులు కృష్ణా సాగుజలాలతో కళకళలాడుతున్నాయి. ఇదేకాకుండా కల్వకుర్తి చుట్టుపక్కల ఏడు మండలాలకు మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందుతుంది.

**కల్వకుర్తి ఆర్డీవో డివిజన్ ఏర్పాటు**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం కల్వకుర్తిని రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలోని 8గ్రామాలను విడదీసి ఊర్కొండ మండలంగా ఏర్పాటు చేసింది. అదేవిధంగా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూర్ మండలంలోని నాలుగు గ్రామాలు, కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలంలోని 4 గ్రామాలను కలిపి చారకొండ మండలంగా మార్చింది. కల్వకుర్తి, వెల్దండ, వంగూర్, చారకొండ, ఊర్కొండ మండలాలను కలిపి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు.

**కల్వకుర్తిలో డీఎస్పీ కార్యాలయం**

కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసిన వెంటనే పోలీస్ డీఎస్పీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం వెల్దండ మండలంలో సీఐ కార్యాలయం ఏర్పాటు చేశారు. కల్వకుర్తి, వెల్దండ సీఐ కార్యాలయాలుగా, కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, ఊర్కొండ, వంగూర్ మండలాలతో కూడిన డీఎస్పీ కార్యాలయం కల్వకుర్తిలో ఏర్పాటైంది.

**రెండు జిల్లాలలో విస్తరణ**

కల్వకుర్తి నియోజకవర్గం(నాగర్‌కర్నూల్, రంగారెడ్డి)రెండు జిల్లాలలో విస్తరించి ఉంది. కల్వకుర్తి, వెల్దండ మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉండగా.., ఆమగనల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలు రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాల పునర్విభజనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆమగనల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపి విప్లవాత్మకమైన మార్పులకు తెరతీసింది. నాలుగు మండలాలు రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయడంతో సదరు మండలాలు పట్టణీకరణ వైపు పరుగులు పెడుతున్నాయి. కల్వకుర్తి నియోజకర్గంలో కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల నుంచి కొన్ని గ్రామాలను విడదీసి కడ్తాల మండలాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ మధ్యన ఇర్విన్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేసేందుకు వీలుగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

**గురుకులాల హబ్ కల్వకుర్తి**

కల్వకుర్తి ప్రస్తుతం గురుకులాలకు హబ్‌గా ఉంది. గతేడాది వెల్దండ మండల కేంద్రంలో ఏవకల్య గురుకుల పాఠశాల ఏర్పాటు కాగా, ఈ సంవత్సరం బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటైంది.



అత్యాధునిక వసతులతో నిర్మించిన కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయం

దీంతో బీసీ బాలికల పాఠశాల, కళాశాల, బీసీ బాలుర పాఠశాలలు ఉన్నాయి. ఇదేకాకుండా ఎస్సీ, ఎస్టీ బాలికల, బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలతో కొత్తగా మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల ఏర్పాటైంది.

**మూడు జాతీయ రహదారులు**

కల్వకుర్తి నియోజకవర్గంలో మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. హైదరాబాద్- శ్రీశైలం రహదారి(ఎన్‌హెచ్ 365), కోడాద- జడ్చర్ల రహదారి, కొత్త్రి-నంధ్యాల(167కే) మూడు రహదారులు ఉన్నాయి. 167కే రహదారి పనులు ఈ మధ్యనే ప్రారంభమయ్యాయి. హైదరాబాద్-శ్రీశైలం, కోదాడ, జడ్చర్ల పనులు ఇదివరకే పూర్తయ్యాయి.

**అభివృద్ధిలో మున్సిపాలిటీల ముందంజ**

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఏర్పాటైన కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. టీయూఎఫ్ఐడీసీ నిధులు, ఇతర నిధులు దాదాపు రూ.150 కోట్లతో పార్కులు, సీసీరోడ్లు, భూగర్భ మురుగుకాల్వలు పూర్తి చేశారు. చాలా కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. కల్వకుర్తి మున్సిపాలిటీకి రూ.2 కోట్లతో కొత్త భవనం ఏర్పాటైంది.

**వందపడకల దవాఖాన, డయాలసిస్ కేంద్రం**

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు కల్వకుర్తి పట్టణంలో వంద పడకల దవాఖాన 20రోజులు కిందట రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఆమనగల్లు మండల కేంద్రంలో 50 పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కల్వకుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. కడ్తాల మండల కేంద్రంలో దాదాపు రూ.1.50 కోట్లతో ఆత్యాధునిక పోలీస్‌స్టేషన్‌ను నిర్మించారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త వేరు చేసి ఉపయుక్తమైన వస్తువులు, బయోగ్యాస్ తయారు చేసేందు కు సెగ్రిగేషన్ ట్యాంకు, వీధి వ్యాపారుల కోసం 56షెడ్లు నిర్మించారు. ఆమనగల్లు మండల కేంద్రంలో రూ.2కోట్లతో గ్రంథాల యం భవనాన్ని ని ర్మించారు. రైతులకు ఉపయుక్తంగా ఉండేందుకు క్లస్టర్లవారీగా రైతువేదికలు, గ్రామ గ్రామాన స్మశానవాటిక లు, ఉద్యానవనా లు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు సురసము ద్రం మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నా యి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటయ్యాయి. కొత్త పంచాయతీల్లో జీపీ భవనాలను నిర్మించారు. తెలంగాణ సిద్ధించాక కల్వకుర్తి నియోజకవర్గంలో దాదాపు రూ.3వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి.

---

# రెండోదశ ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్
- 826 పోలింగ్ కేంద్రాలకు 3,964 మందికి ఎన్నికల విధులు కేటాయింపు



ఎన్నికల విధులను కేటాయిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 18: ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో జిల్లాలో ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు మిథిలేస్ మిశ్రా, సతీశ్‌కుమార్‌తో కలిసి పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలతోపాటు కల్వకుర్తి పరిధిలోని 103 పోలింగ్ కేంద్రాలు, జడ్చర్ల పరిధిలో 22 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం పోలింగ్ కేంద్రాలు 826 ఉన్నాయని, కొల్లాపూర్ నియోజకవర్గం లోని వీపనగండ్ల, పాన్‌గల్ చిన్నంబావి మండలాల పరిధిలోని 114 పోలింగ్ కేంద్రాలు వనపర్తి జిల్లాలో ఉన్నాయని వాటికి సిబ్బందిని వనపర్తి కలెక్టర్ కేటాయిస్తారని, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఊర్కకొండ మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల సిబ్బందిని కూడా ఇక్కడినుంచే కేటాయిస్తామన్నారు. మొత్తం 826 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, 3,964 మంది ఓపీవోలను ఎన్నికల విధులకు కేటాయిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 20శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. జిల్లాలో మొత్తం 991మంది ప్రిసైడింగ్ అధికారులు, 991 మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1,982 మంది ఓపీవోలను పారదర్శకంగా ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేశామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, మ్యాన్ పవర్ నోడల్ అధికారి కార్తీక్‌కుమార్, ఈడీఎం నరేశ్, ఎన్ఐసీ కోఆర్డినేటర్ హర్షత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల మనస్సెరిగిన నేత నిరంజన్‌రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి**

వనపర్తి, నవంబర్ 18: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ప్రజల మనస్సు ఎరిగిన ప్రజానాయకుడు మంత్రి నిరంజన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఖితాబిచ్చారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వివిధ సామాజికవర్గాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి నిరంజన్‌రెడ్డి కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రావుల కోరారు. ఈ సందర్భంగా గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచినీరు, పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, రెవెన్యూ డివిజన్, వంద పడకల దవాఖాన, విద్యాసంస్థలు చేశామని కానీ నిరంజన్‌రెడ్డి ప్రజల ఆలోచనలో ఏముందో పసిగట్టి భవిష్యత్ తరాల కోసం అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు.నియోజకవర్గాన్ని జిల్లా చేసుకోవడంతో మొదలు పెట్టి ఒక్కక్కటిగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్, నర్సింగ్ ఇంజినీరింగ్, వ్యవసాయ, మత్స్యశాఖ, ఎంసీహెచ్, వంటివి ఏర్పాటు చేసుకొని, వనపర్తి నలువైపులా ఉన్న చెరువులు, రోడ్ల విస్తరణ ను ఆధునీకరణ చేసి పట్టణానికి రూపు తీసుకొచ్చారన్నారు. వినూత్న ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి కొనసాగిస్తున్న నిరంజన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలబడుదామన్నారు. ఈనెల 30వ తేదీ పో లింగ్‌లో కారుగుర్తుకు ఓటు వేసి మరోసారి నిరంజన్‌రెడ్డిని అసెంబ్లీకి పంపించి, వనపర్తి అభివృద్ధికి తోడ్పుటువుందామన్నారు. అంతకుముం దు ఖిల్లాఘణపురం మండలం పార్వతీపురం యూత్ సభ్యులకు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నందిమళ్ల అశోక్, వేణురెడ్డి, చిట్యాల సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, సయ్యద్, జమీల్, కోటన్న తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి